అహో..అర్బన్‌పార్క్

అక్కన్నపేట అటవీ ప్రాంతంలో శరవేగంగా పనులు

వాచ్ టవర్, గెజిబోలు, ఆటవస్తువులు.. మరెన్నో

హైదరాబాద్‌వాసులకూ విహార కేంద్రంగా..

7




జయారెడ్డి - గుణచైతన్యరెడ్డిలకు ఆశీస్సుల వెల్లువ

సంగారెడ్డిలోని రామమందిర్ వేదికగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డిల తనయ జయారెడ్డి వివాహం గుణచైతన్యరెడ్డితో గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.










రైతు మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, హరీశ్‌రావు

రైతులు ధర్నా చేసే దుస్థితి దాపురించింది

● మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మెదక్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతాంగ సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి కలెక్టరేట్ ఎదుట ధర్నాలు చేసే దుస్థితి దాపురించిందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం మెదక్ కలెక్టరేట్ ఎదుట రైతు మహాధర్నా నిర్వహించగా ఆయన హాజరై ప్రసంగించారు. కృష్ణా, గోదావరిల్లో నీరంతా సముద్రంలో కలుస్తున్నా పట్టించుకోకుండా, పంటలకు నీరు విడుదల చేయడంలేదని వాపోయారు. వరికి బోనస్ ఇస్తామని విస్మరించిందన్నారు. ఈ ప్రభుత్వానికి భూములను నమ్ముకునే రైతు పట్టడని, భూములు అమ్ముకునే రియల్టర్లకు వత్తాసు పలుకుతుందని మండిపడ్డారు. సీఎం రేవంత్ పాలనను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రాజెక్టుల గేట్లు బద్దలు కొడతాం

మల్లన్నసాగర్, కొండపోచంపల్లి ప్రాజక్టు నుంచి పంటలకు నీరు మిగతా 8లో

కలెక్టర్‌కు సిగ్గూ, శరం లేదు : కేపీఆర్

మెదక్ కలెక్టర్‌కు అసలు సిగ్గూ, శరం లేనే లేవు... కేవలం కాంగ్రెస్ నేతలతోనే ఆయన మాట్లాడతారని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్ ప్రసంగాలు గాంధీభవన్‌లో రూపుదిద్దుకుంటున్నాయా అని ప్రశ్నించారు. జిల్లాలో కాంగ్రెస్ నేతలకు పోలీస్ ఎస్కార్ట్ ఇస్తున్నారని వాపోయారు.

టీవీవీపీ ఆస్పత్రులకు కొత్త జనరేటర్లు

● రెండు ఏరియా, మూడు సీహెచ్‌సీల్లో ఏర్పాటు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పరిధిలో సంగారెడ్డి జిల్లాలోని ఐదు ఆస్పత్రులకు కొత్తగా డీజిల్ జనరేటర్ల(డీజీ సెట్) ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. పటాన్‌చెరు, నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రులతో పాటు సదాశివపేట, కరస్‌గుత్తి, కల్హేర్ సీహెచ్‌సీల్లో కొత్త జనరేటర్లు ఏర్పాటు కానున్నాయి. హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్)కింద జనరేటర్లు కొనుగోలు చేసి సంబంధిత బిల్లులు టీజీఎంఎస్ఐడీసీ సమర్పించాల్సి ఉంటుంది. ఆయా ఆస్పత్రుల్లో కొత్తగా జనరేటర్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీసీహెచ్‌ఎస్‌లను ఆదేశించారు. ఇటీవల జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో సెల్‌ఫోన్ లైట్ వెలుగులో రోగులకు చికిత్స చేయడంతో సర్కారు సీరియస్‌గా పరిగణించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించి జనరేటర్లను ఏర్పాటు చేస్తున్నది.

వరుణుడు కరుణించక.. వరి వేయక..!

కల్హేర్ మండలంలో అనావృష్టి

అడుగంటుతున్న భూగర్భ జలాలు, ఒట్టిపోతున్న బోర్లు

ప్రశ్నార్థకంగా పంటల సాగు, ఆందోళనలో రైతన్న

7

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని జాతీయ రహదారులపై ప్రయాణించే వారు అలసిపోతే.. రోడ్డు పక్కనే సేదదీరవచ్చు. అవసరం ఉన్నంత వరకు విశ్రాంతి తీసుకుని మళ్లీ తన ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల వెంట విశ్రాంతి కేంద్రాలు (వే సైడ్ ఎమినిటీ సెంటర్) ఏర్పాటు చేస్తున్నది.



హైవేల పక్కన నిర్మించనున్న ఎమినిటీ సెంటర్ నమూనా

హైవే పక్కన విశ్రాంతి కేంద్రాలు

ప్రయాణికులకు సౌకర్యం.. ప్రమాదాల నివారణ

ప్రతీ 40 కిలోమీటర్లకు వేసైడ్ ఎమినిటీ సెంటర్ నిర్మాణం

రెస్టారెంట్లు, పార్కింగ్, పిల్లల పార్కుల ఏర్పాటు

రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్రం నూతన ప్రణాళిక

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా 5,000 వేసైడ్ ఎమినిటీ సెంటర్‌లు నిర్మించేందుకు కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది. హైవే పక్కన ప్రతీ 40 కిలోమీటర్లకు నిర్మించనున్నారు. ఈ కేంద్రాల్లో పార్కింగ్ స్థలాలు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టులు, దాబాలు, పిల్లల ఆట స్థలాలకు సౌకర్యాలు ఉంటాయి. తక్కువ ఖర్చుతో ప్రయాణికులు హాయిగా విశ్రాంతి తీసుకునేలా ఈ రూపొందించనున్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాలను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

మూడు హైవేలపై ప్రయోజనం

సంగారెడ్డి జిల్లా నుంచి రెండు, మెదక్ జిల్లా మీదుగా ఒక జాతీయ రహదారి వెళ్తుంది. 161వ జాతీయ రహదారి హైదరాబాద్ నుంచి సంగారెడ్డి, జోగిపేట, పెద్దశంకరంపేట, నిజాంపేట, పిట్లం, బిచ్కుంద, డెగ్లూర్, నాందేడ్ మీదుగా మహారాష్ట్రలోని అకోలా వరకు విస్తరించి ఉంది. ఇక 65వ జాతీయ రహదారి హైదరాబాద్ నుంచి పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ వరకు విస్తరించి ఉంది. అలాగే హైవే44 హైదరాబాద్ నుంచి మెదక్ జిల్లా మనోహరాబాద్, తూప్రాన్, మాసాయిపేట, చేగుంట మీదుగా నాగ్‌పూర్ వెళ్లే హైవే ఉంది. ఈ మూడు జాతీయ రహదారులపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారుల వెంబడి విశ్రాంతి కేంద్రాలు ఏర్పాటైతే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

రోడ్డు ప్రమాదాల తగ్గింపు

ప్రస్తుతం దూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు, ప్రయాణికులు అలసటతో ప్రైవేట్ లాడ్జీలు, దాబాలను ఆశ్రయిస్తున్నారు. అయితే, ఈ స్థలాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం, లాడ్జీలలో గదుల ఖర్చు ఎక్కువగా ఉండటం వల్ల చాలా మంది నిద్ర లేకుండా వందల కిలోమీటర్లు ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో డ్రైవర్లు అలసట, నిద్రమత్తులో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కొత్త రెస్ట్ స్టాప్ భవనాల ఏర్పాటుతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

రీజనల్ రోడ్డు భూసేకరణలో వేగం పెంచండి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పరిధిలో నిర్మించే రీజనల్ రింగ్ రోడ్డు కోసం భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు మొత్తం ఐదు ప్యాకేజీలుగా ఈ రహదారిని నిర్మించనున్నట్టు తెలిపారు. రైతుల నుంచి భూమి సేకరించే సమయంలో రైతులకు న్యాయపరమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, అందోల్ ఆర్డీవో పాండు, గజ్వేల్ నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ శ్రీహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

నిమ్జ్‌తో ఉద్యోగావకాశాలు

నిమ్జ్ ప్రాజెక్టుతో రాష్ట్ర ఆర్థిక ప్రగతి మెరుగుపడడంతో పాటు జిల్లాలో ఉద్యోగావకాశాల వస్తాయని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిమ్జ్ ప్రాజెక్టు ఫేజ్-1కు సంబంధించి బర్దిపూర్, చీలపల్లి గ్రామాల్లో భూ సేకరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం ఇతర ప్యాకేజీల వివరాలు, భవిష్యత్తులో జరగనున్న గ్రామాభివృద్ధిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఫేజ్-2 భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా, పరిహార చెల్లింపు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, నిమ్జ్ ప్రత్యేకాధికారి, ఆర్డీవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పండుగకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

● మూడు రోజుల పాటు అదనపు బస్సులు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రాఖీ పండుగ సందర్భంగా టీజీఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ప్రతీ ఏడాది పండుగ సందర్భంగా ప్రయాణికులు రద్దీ మేరకు మూడు రోజుల పాటు అదనపు బస్సులు నడుపుతున్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో అదనపు సర్వీసులు నడపాలని నిర్ణయించింది. ఈసారి రాఖీ పండుగతోపాటు ముందు రోజు శుక్రవారం(నేడు) వరలక్ష్మీవ్రతం, 10న ఆదివారం సాధారణ సెలవుతో కలిపి మూడు రోజులపాటు వరుస సెలవులున్నాయి. పాఠశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వరుస సెలవులు ఉండటంతో ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని సర్వీసులను నడపనున్నారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాకు వచ్చే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశాల నేపథ్యంలో రీజియన్ వ్యాప్తంగా సుమారు 200పైగా అదనపు సర్వీసులు నడపనున్నట్టు అధికారులు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉంటే అదనంగా మరిన్ని బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి ఆర్టీసీ అదనపు చార్జీలు వసూలు చేయనున్నది.



తారల సందడి

రామచంద్రాపురంలో గురువారం ఓ వస్త్ర దుకాణాన్ని ప్రారంభించగా హీరోయిన్‌లు రీతూవర్మ, నేహాశెట్టి సందడి చేశారు.

- రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి)

పటాన్‌చెరులో కుండపోత



పటాన్‌చెరులో జోరుగా కురుస్తున్న వర్షం

పటాన్‌చెరు ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా, నగర శివారు ప్రాంతాలైన పటాన్‌చెరు పరిధిలో గురువారం కుండపోత వాన కురిసింది. సాయంత్రం సమయంలో ప్రారంభమై రాత్రి ఎనిమిది గంటల వరకు భారీ వర్షం పడింది. మూడు గంటల పాటు వర్ష బీభత్సంతో పటాన్‌చెరు, రామచంద్రాపురం, ఇంద్రేశం, రుద్రారం, భానూరు, తెల్లాపూర్ ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. బీరంగూడ కమాన్‌వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. పటాన్‌చెరు టోల్‌గేటు సమీపంలో జాతీయ రహదారిపైకి వర్షపునీరు చేరింది. ముత్తంగి ఔటర్ సమీపంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్ల పక్కన కాల్వలను తవ్వారు. వాటిల్లోకి వర్షపునీరు చేరి ప్రమాదకరంగా మారాయి. ఇస్నాపూర్ కూడలి నుంచి లక్దారం గ్రామ గేటు వరకు వాహనాలు నిదానంగా ప్రయాణం చేశాయి.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

సిద్దిపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సిద్దిపేట రూరల్ మండలం రాంపూర్ పంచాయతీ కార్యదర్శి ఎటిబాబు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుండగా, మార్గమధ్యలో రేషన్ షాపు వద్ద ఇద్దరు వ్యక్తులు మద్యం సేవిస్తుండటాన్ని గమనించారు. ప్రభుత్వ స్థలంలో మద్యం సేవించడంపై వారిని ప్రశ్నించగా, రవి, నర్సింహులు అనే వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడి, ఆయన విధులకు ఆటంకం కలిగించారు. దీంతో ఎటిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూజల విషయంలో ఘర్షణ

● పరస్పరం దాడి.. కేసు నమోదు

పటాన్‌చెరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మండలంలోని రుద్రారం గ్రామంలో పూజల విషయంలో జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం, బీహార్‌కు చెందిన దంపతులు తమ కొత్త ఇంట్లో సంప్రదాయ పద్ధతిలో గృహప్రవేశ పూజలు చేస్తున్నారు. తెల్లవారుజామున పూజలు చేస్తుండగా, అనుమానం వచ్చిన పక్కింటి వారు దుర్గయ్య, హేమంత్‌లు దాని గురించి ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన బీహార్ దంపతులు ఘర్షణకు దిగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రవి, దుర్గయ్య, హేమంత్‌లకు గాయాలయ్యాయి. దుర్గయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ప్రమాదంలో ఇద్దరి మృతి


బాలమణి, ఆంజనేయులు(ఫైల్)

శివ్వంపేట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకరిమెట్ల దేవాలయం సమీపంలో గురువారం జరిగిన కారు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శివ్వంపేటకు చెందిన బాలమణి (70)ని ఆమె చిన్న కుమారుడు నర్సింహులు ఇంటికి తీసుకెళ్తుండగా, లింగాపూర్‌కు చెందిన డ్రైవర్ ఆంజనేయులు (35) కారు నడుపుతున్నాడు. ఈ క్రమంలో చాకరిమెట్ల దేవాలయం వద్ద మూలమలుపులో కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో బాలమణి, డ్రైవర్ ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. బాలమణి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్ రెడ్డి తెలిపారు. శివ్వంపేటలో నిర్వహించిన బాలమణి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే సునీతా రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువాసిని రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో గడ్డి మందు తాగిన వ్యక్తి

● చికిత్స పొందుతూ మృతి

సిద్దిపేట రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామానికి చెందిన పెండ్యాల సుధాకర్ రెడ్డి(45) ఐదేళ్ల క్రితం ఇర్కోడు గ్రామంలో ఇల్లు నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. కూలి పనులు చేసేకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు అధికం కావడంతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని సిరిసిల్ల జిల్లాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ


మద్యం దుకాణం పై కప్పు రేకులు తొలగించిన దృశ్యం

పుల్కల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండల కేంద్రంలోని వినాయక వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే ఈ ఘటన జరగడం ఆందోళన కలిగిస్తోంది. దుండగులు మద్యం దుకాణం పైకప్పు రేకులను తొలగించి లోపలికి ప్రవేశించి, సుమారు రూ.25 వేల నగదు, ఖరీదైన మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలను కూడా ధ్వంసం చేశారు. గత పక్షం రోజుల్లో సింగూరులోని మహాలక్ష్మి వైన్స్‌లోనూ రూ.90 వేలు చోరీ జరిగింది. అలాగే జూలై 18న చౌటకూర్‌లో గుండయ్యకు చెందిన రూ.60 వేల విలువైన నాలుగు మేకలను దొంగిలించారు. వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీ లేకపోవడమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

2 కిలోల ఎండు గంజాయి పట్టివేత


గంజాయి, నిందితుడిని చూపిస్తున్న అధికారులు

వట్‌పల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రెండు కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గాంధీ నాయక్, ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయిపై నమ్మదగిన సమాచారం అందడంతో వట్‌పల్లి శివారులో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని మంచిరాలతండాకు చెందిన పి. జయపాల్ నాగలగిద్ద నుంచి వట్‌పల్లికి గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. రూ.1.70 లక్షల విలువైన రెండు కిలోల గంజాయి, ఒక బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ హలీం, సిబ్బంది అనిల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం


మోయిజ్(ఫైల్)

జహీరాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో, మండలంలో వేర్వేరుగా ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. జహీరాబాద్ పట్టణంలోని హమాలీ కాలనీకి చెందిన మోయిజ్ (48) ఈ నెల 3న అదృశ్యమయ్యాడని పట్టణ ఎస్‌ఐ వినయ్‌కుమార్ తెలిపారు. రాంనగర్‌కు చెందిన మోయిజ్ కూలి పనులు చేస్తుంటాడని, రోజు మాదిరిగానే ఉదయం 6 గంటలకు పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో మోయిజ్ భార్య షబానా బేగం గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మోయిజ్ ఆచూకీ తెలిసిన వారు జహీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

హుగ్గెలి గ్రామంలో మహిళ..


బక్కమ్మ(ఫైల్)

జహీరాబాద్ మండలంలోని హుగ్గెలి గ్రామంలో మహిళ అదృశ్యమైంది. రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం హుగ్గెలి గ్రామానికి చెందిన జంబుల బక్కమ్మ(48) ఈ నెల 4న రాత్రి భోజనం చేసి ఇంట్లో పడుకున్నది. ఉదయం లేచి చూసేసరికి బక్కమ్మ కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. దీంతో ఆమె కుమారుడు జంబుల వంశీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బక్కమ్మ ఆచూకీ తెలిసిన వారు 8712661847, 871265674, 8712656731 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


లక్ష్మయ్య (ఫైల్)

గజ్వేల్‌రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బందెల లక్ష్మయ్య(58) రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని లక్ష్మయ్యను గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బూడిదైన ఫార్మా కోల్డ్ స్టోరేజ్

సోలార్ ప్యానల్ వద్ద షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు

రూ.కోట్లల్లో నష్టం వాటిల్లినట్లు అంచనా

గుమ్మడిదల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి గుబ్బ ఫార్మా కోల్డ్ స్టోరేజ్ బూడిదైన ఘటన మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. రాత్రి 9 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగగా, స్టోరేజ్‌లో రసాయన పదార్థాలు నిల్వ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి, కొంతసేపటికే బూడిదగా మారిపోయింది. సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. ఐదు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. దాదాపు తొమ్మిది గంటల పాటు శ్రమించగా గురువారం మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. కోల్డ్ స్టోరేజ్‌లో లిక్విడ్ పౌడర్లు, కెమికల్స్ నిల్వ ఉండటంతో పెద్దఎత్తున పేలుళ్లు సంభవించడంతో పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు రాత్రి నుంచే అటువైపు ట్రాఫిక్‌ను నిలిపివేశారు. డీఎస్పీ ప్రభాకర్, సీఐ నయీముద్దీన్, ఎస్ఐ లక్ష్మీకాంత్‌రెడ్డి సంఘటనా స్థలంలోనే మకాం వేసి చర్యలు చేపట్టారు. అందరి సహకారంతో అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగారు. స్టోరేజ్‌లో సోలార్ ప్యానల్ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. స్టోరేజీలో వివిధ కంపెనీలు విలువైన లిక్విడ్ కెమికల్స్ ఉత్పత్తులు నిల్వలు ఉండటం వల్ల రూ.కోట్లల్లో నష్టం వాటిల్లిందని తెలిసింది.






రథోత్సవం.. రమణీయం

దుబ్బాక, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాకలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల భజనలు, నృత్యాలతో స్వామివారి రథాన్ని పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం స్వామివారి హంసవాహన పలకీ సేవా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీకి రాష్ట్రపతి పుట్టినరోజు శుభాకాంక్షలు



राष्ट्रपति
भारत गणतंत्र
PRESIDENT
REPUBLIC OF INDIA

August 05, 2025

Dear Shri Suresh Kumar Shetkar,

I convey my best wishes on your birthday on 08.08.2025.

May God bless you with good health and happiness and many more years of continued and dedicated service to the nation.

With the best wishes,

Yours sincerely,

(Droupadi Murmu)

రాష్ట్రపతి పంపిన లేఖ

నారాయణఖేడ్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం షెట్కార్ పుట్టినరోజు కాగా, ఆగస్టు 5న రాష్ట్రపతి పంపిన లేఖ గురువారం ఖేడ్‌లోని ఆయన స్వగృహానికి చేరింది. ఈ లేఖలో రాష్ట్రపతి ఆయనకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, శాంతి, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రపతి తనకు శుభాకాంక్షలు తెలుపడం జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని ప్రజలకు గౌరవదాయకంగా భావిస్తున్నట్లు షెట్కార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపారు.

కాజీపల్లిలో ప్రభుత్వ భూముల కబ్జా



ప్రభుత్వ భూమిలో కబ్జాదారులు చేపడతున్న నిర్మాణ పనులు

జిన్నారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం కాజీపల్లిలో ప్రభుత్వ భూముల కబ్జాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు భూ భారతి స్పెషల్ డ్రైవ్‌లో బిజీగా ఉండగా, అక్రమార్కులు 181 సర్వే నంబర్‌లోని కోటి రూపాయల విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రహరీ పనులు ప్రారంభించారు. స్థానిక పేదల గృహాల పక్కన కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన 300 గజాల స్థలం కూడా ఆక్రమణకు గురైంది. అదేవిధంగా 208 సర్వే నంబర్‌లోని 12 గుంటల స్థలంపై ఉన్న హెచ్చరిక బోర్డును ప్లాస్టిక్ కవర్‌తో కప్పి కబ్జాకు ప్రయత్నించారు. స్థానికుల ఫిర్యాదుతో ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ కవర్‌ను తొలగించారు. అక్రమ నిర్మాణాలు తొలగించి, కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హామీ ఇచ్చారు.

ముగిసిన వృక్షశాస్త్ర రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



వక్తలను, అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సమావేశానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అయోధ్యరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎ. సబితారాణి, ఆత్మీయ అతిథిగా కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, సిద్దిపేట కళాశాల పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ డాక్టర్ రాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు సబితారాణి, రాంరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యశాలల ద్వారా మొక్కలను గుర్తించడం, వాటి ఉపయోగాలు తెలుసుకోవడం నేటి తరానికి ఉపయోగపడుతుందన్నారు. మానవ మనుగడకు మొక్కలు అత్యవసరమని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఉద్ఘాటించారు. అంతకుముందు జరిగిన సాంకేతిక సమావేశంలో డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి మొక్కల వర్గీకరణ, హెర్బేరియం తయారీ గురించి వివరించగా, ప్రొఫెసర్ సిది వీరేశం తెలంగాణలో లభించే ఔషధ మొక్కల గురించి ప్రసంగించారు. ఈ సదస్సులో కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, ఐ.క్యూ.ఏ.సీ కో ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, కార్యశాల కన్వీనర్ డాక్టర్ రాణి కొమ్మిడి, ఆర్గనైసింగ్ సెక్రటరీ శైలజ, డాక్టర్ మీరాజ్ ఫాతిమా, స్రవంతి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అహో.. అర్బన్ పార్క్

- శరవేగంగా అక్కన్నపేట అటవీ ప్రాంతంలో పనులు
- రూ. 2కోట్ల వ్యయంతో 50 హెక్టార్లలో ఏర్పాటు
- వాచ్ టవర్, గెజిబోలు, ఆటవస్తువులు.. మరెన్నో
- హైదరాబాద్‌వాసులకు విహార కేంద్రంగా..



కొనసాగుతున్న ప్రధాన ద్వారం పనులు

రామాయంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండలంలోని అక్కన్నపేట రిజర్వ్ ఫారెస్ట్ త్వరలో పర్యాటకుల సందడితో కళకళలాడనుంది. దాదాపు రూ.2 కోట్ల కేంద్ర నిధులతో 50 హెక్టార్లలో అర్బన్ పార్క్ రూపుదిద్దుకుంటోంది. మరో ఆరు నెలల్లో ఈ నగరవనం పర్యాటకులకు అందుబాటులోకి రానుంది. ఈ పార్క్ హైదరాబాద్ ప్రజలకు కూడా ఒక మంచి విహార కేంద్రంగా మారే అవకాశం ఉంది. ఇది అక్కన్నపేట రైల్వే స్టేషన్‌కు కేవలం 2 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. గత డిసెంబర్‌లో అర్బన్ పార్కు యోజన పథకం కింద మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కేవలం ఏడు నెలల వ్యవధిలోనే పార్క్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.

ప్రత్యేక సదుపాయాలు

ఈ అర్బన్‌పార్క్‌లో పర్యాటకులను ఆకట్టుకునేందుకు అనేక ఏరాట్లు చేశారు. ప్రకృతి అందాలను తిలకించేందుకు మూడు అంతస్తుల వాచ్ టవర్‌ను నిర్మించారు. సందర్శకులు విశ్రాంతి తీసుకోవడానికి గెజిబోలు, ఆహ్లాదంగా గడిపేందుకు పిల్లల ఆట వస్తువులు, మరుగుదొడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు ఏరాటు చేస్తున్నారు. అడవికి రక్షణగా చుట్టూ ఫెన్సింగ్, ఆకర్షణీయమైన మెయిన్ గేటు నిర్మాణం పూర్తయ్యాయి. ప్రవేశానికి టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌కు దగ్గరలో..

హైదరాబాద్ నుంచి వచ్చేవారికి అక్కన్నపేట రైల్వే స్టేషన్ ఒక మంచి ప్రయాణ మార్గం. కేవలం రెండు గంటల్లో అక్కడికి చేరుకుని, స్టేషన్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్కును సందర్శించవచ్చు. ఇది సెలవు దినాల్లో కుటుంబంతో కలిసి గడపడానికి చక్కని ప్రదేశంగా మారడంతోపాటు పర్యాటకంగా ప్రసిద్ధి గాంచనుంది.



నిర్మాణ దశలో వాచ్ టవర్

వేగంగా పనులు..



ఈ అర్బన్ పార్క్ హైవేకు దగ్గరలో ఉండటం వల్ల ప్రయాణికులకు కూడా ఎంతో సౌకర్యంగా ఉంటుంది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే పర్యాటకుల సందర్శనార్థం దీనిని ప్రారంభించనున్నాం. ఈ పార్కుతో ఈ ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది.

\- అంబర్ సింగ్, ఎఫ్ఆర్‌వో



అడవి మధ్యలో పర్యాటకులు రాకపోకలు సాగించేందుకు దారి



పర్యాటకులు సేద తీరేందుకు కడుతున్న గెజిబో

వారం పాటు తిరంగా యాత్ర

- ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపు
- బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్

మెదక్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా వ్యాప్తంగా వారం రోజులు హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ తెలిపారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రధాన మోదీ దృఢమైన సంకల్పం, నిర్ణయాత్మక నాయకత్వానికి సాయుధ దళాల ధైర్యసాహసాలకు దేశ ప్రజల ఆకాంక్షలు తోడవడంతో ఆపరేషన్ సిందూర్ గొప్ప విజయం సాధించిందన్నారు. కొత్త సుసంపన్న, బలమైన, ఆత్మనిర్భర్ భారత్‌కు ఇది నిదర్శనమన్నారు. ప్రజలతో కలిసి తిరంగా యాత్రలు, దేశ సమైక్యత సమగ్రత కోసం ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఈ నెల 8 వరకు మండల స్థాయిలో, 9 నుంచి 12 వరకు యువ మోర్చా అధ్వర్యంలో తిరంగా యాత్రలు, దేశభక్తి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 14 వరకు స్వచ్ఛతా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆగస్టు 15 సందర్భంగా ప్రతీ భారతీయుడికి దేశం పట్ల గౌరవం, అంకిత భావం వివరిస్తూ... వారికి వారి ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగరవేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాములు, స్థానిక సంస్థల జిల్లా ఇంచార్జి రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ మధు, జిల్లా నాయకులు సుధాకర్, విజయ్‌కుమార్, రాజేందర్, మల్లారెడ్డి, సిద్దిరాములు, ప్రభాకర్, నాగరాజు, లోకేష్, హర్‌ఘర్ తిరంగా కన్వీనర్లు రంజిత్‌రెడ్డి, అశోక్, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్

సంగారెడ్డి కొత్త బస్టాండ్ ప్లాట్‌ఫామ్ విస్తరణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ ప్లాట్‌ఫామ్ విస్తరణకు ఆర్టీసీ చర్యలు తీసుకున్నది. నారాయణఖేడ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వచ్చే ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు ప్లాట్‌ఫామ్ సమస్య ఏర్పడుతున్నది. అంతేకాకుండా స్థలం తక్కువగా ఉండటంతో నారాయణఖేడ్ బస్సులు రివర్స్ తీసే క్రమంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్లాట్‌ఫామ్ విస్తరణకు అడుగులు వేశారు. ఇందులో భాగంగా కొత్త బస్టాండ్ ప్రాంగణంలోనే ఖాళీ స్థలాన్ని చదును చేశారు. అంతేకాకుండా బస్సులు వచ్చి, పోయే(ఇన్-ఔట్) మార్గాల్లో మార్పులు చేయనున్నారు. త్వరలో ప్లాట్‌ఫామ్ విస్తరణ పనులు ప్రారంభం కానున్నట్టు డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు.



వరుణుడు కరుణించచక.. వరి వేయక..!

- కల్హేర్ మండలంలో అనావృష్టి
- అడుగంటుతున్న భూగర్భ జలాలు, ఒట్టిపోతున్న బోర్లు
- ప్రశ్నార్థకంగా పంటల సాగు, ఆందోళనలో రైతన్న

కల్హేర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా, ఉమ్మడి కల్హేర్ మండలంలో మాత్రం వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పక్కనే ఉన్న నారాయణఖేడ్‌లో కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నా, ఇక్కడ మాత్రం చినుకు వర్షం లేకపోవడం విచిత్రంగా ఉందని స్థానికులు అంటున్నారు. దీంతో గ్రామాల్లోని కుంటలు, చెరువులు ఎండిపోయి, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటాయి. కల్హేర్, సిర్గాపూర్, నిజాంపేట మండలాల్లో పరిస్థితి ఇలాగే ఉంది. ఈ మూడు మండలాల్లోని వందకు పైగా చెరువులు ఉండగా ఒకదానిలో కూడా 10 శాతం నీరు చేరలేదంటే ఈ ప్రాంతంలో వర్షాకాలం పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వరినాట్లు 40 శాతమే..

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు అయిన నల్లవాగులోకి కూడా నీరు చేరలేదు. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయిందని రైతులు తెలిపారు. కల్హేర్ మండలంలో 13,000 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 40 శాతం నాట్లు మాత్రమే వేశారు. అవి కూడా బోరు బావుల కిందే. ఈ పంటలు దక్కాలంటే వర్షాలు కురవాల్సిందేని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో బోరుబావుల్లో నీరు తగ్గడంతో, మరో నాలుగైదు రోజుల్లో వర్షాలు రాకపోతే పంటలు ఎండిపోతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వరితో పాటు సోయా, పత్తి, పెసర పంటలు కూడా ఎండు దశకు చేరుకున్నాయి. వరి నాట్ల కోసం ఎకరాకు రూ. 5 వేల వరకు ఖర్చు చేసిన రైతులు పెట్టుబడులు నష్టపోతామని దిగాలు చెందుతున్నారు.



సన్నటి ధారగా పోస్తున్న బోరు

నీరు లేక వెలవెల బోతున్న కల్హేర్ మర్రి కుంట



వరి వేయడం మానుకున్నాం..



వరి నాటు వేద్దామని పొలాన్ని దున్ని సిద్ధం చేశాను. కానీ, బోరుబావిలో నీళ్ల అడుగంటిపోయాయి. వాన కోసం ఎదురు చూసి, బోరులో నీళ్ల లేక చివరికి వరి వేయడం మానుకున్నాను.

-ఛత్ర్యా నాయక్, రైతు, మార్డి తండా

బోరుబావిలో నీరు కరువైంది..



రెండున్నర ఎకరాల్లో వరి నాట్లు వేశాను. బోరుబావిపై ఆధారపడి పంట వేయాలని అనుకున్నాను. కానీ, వర్షాలు లేకపోవడంతో బోరులో నీరు రోజురోజుకూ తగ్గిపోతోంది. భారీ వర్షాలు కురిస్తే తప్ప పంట దక్కే అవకాశం లేదు

-ప్రకాష్, రైతు, ఇందిరానగర్

గురుకుల వసతి గృహాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

నారాయణఖేడ్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలతో పాటు వాటికి సంబంధించిన వసతి గృహాన్ని గురువారం సబ్ కలెక్టర్ ఉమాహారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, రికార్డులు, వంటశాలను పరిశీలించారు.

బోనాలకు ఏర్పాట్లు

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం డివిజన్ పరిధి ఐదుగుళ్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం జరగనున్న బోనాలపై కార్పొరేటర్ పుష్పానగేష్ గురువారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని వివరించారు.

భూభారతి సర్వే పరిశీలన

వట్‌పల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని షాద్నగర్‌లో నిర్వహించిన భూభారతి సర్వే వివరాలతో పాటు పహాని రికార్డులను ఆర్డీవో పాండు పరిశీలించారు. వట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. సర్వేకు సంబంధించిన విషయాలను తహసీల్దార్ చంద్రశేఖర్, సర్వేయర్ మురళీధర్‌ను అడిగి తెలుసుకున్నారు.

జడ్పీ సీఈవోకు సన్మానం

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ సీఈవో జానకీరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం జడ్పీ కార్యాలయంలో పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, ప్రధాన కార్యదర్శి రాహుల్, రవి, భాస్కర్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ సిబ్బందికి వేతనాలేవి?

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న 150 మంది సిబ్బందికి 4 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరాజం అన్నారు. గురువారం కార్మికశాఖ కార్యదర్శి సలీంకు వినతిపత్రం అందజేశారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రేషన్‌కార్డులే లేవు

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

చిన్నశంకరంపేట/రామాయంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు విమర్శించారు. చిన్నశంకరంపేట మండలవ్యాప్తంగా మంజూరైన 846 నూతన రేషన్‌కార్డులను ఎమ్మెల్యే, కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీవో రమాదేవి, సివిల్ సప్లయ్ అధికారి నిత్యానందం చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డు అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు మంజూరు చేసిందన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రామాయంపేట, నిజాంపేట మండలాల్లో ఎమ్మెల్యే రోహిత్‌రావు కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్లు రజనీకుమారి, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సుప్రభాతరావు, అమర్ సేనారెడ్డి పాల్గొన్నారు.



రైతువేదికలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్, కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం : ఎమ్మెల్యే

గుమ్మడిదల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే ప్రముఖ శైవక్షేత్రంగా పేరొందిన బొంతపల్లి వీరన్నగూడెం భద్రకాళీసమేత వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆలయ ఆవరణలో రూ.8.60 కోట్లతో ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పాలకవర్గం ఆధ్వర్యంలో చేపట్టిన 142 అడుగుల పొడవుతో 9 అంతస్తులతో నిర్మించతలపెట్టిన రాజగోపురం పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. చరిత్ర కలిగిన బొంతపల్లి ఆలయ అభివృద్ధికి దశాబ్దికాలంగా సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ దశరథ్, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామి ఆలయంలో రాజగోపుర నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మహిపాల్‌రెడ్డి

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్యం అందుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో మందుల స్టోర్, ల్యాబ్ గదిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యమందించాలని వైద్యాధికారి డాక్టర్ సాయిసింధును ఆదేశించారు. అనంతరం వైద్యం గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీపీవోలు



సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి పూల మొక్కను అందజేస్తున్న జీపీవోలు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కలెక్టరేట్‌లో నూతన జీపీవో (గ్రామపాలన అధికారులు) గురువారం కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ వీఆర్వో సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతలో 174 మంది, రెండో విడతలో 46 మంది మొత్తం 220 మంది పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సత్యనారాయణ, సంతోష్‌కుమార్, శివరాం, శివరామకృష్ణ, నాగరాజు, మల్లేశం తదితరులు ఉన్నారు.

అక్షరాస్యులను చేసేందుకు 'ఉల్లాస్'



మాట్లాడుతున్న సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకే ఉల్లాస్ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో రిసోర్స్ పర్సన్లకు గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నిరక్షరాస్యులను, అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు వివరించారు. వయోజన విద్య ఉపసంచాలకుడు వెంకటరెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి ఉల్లాస్ శిక్షణ ఉద్దేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో బాలయ్య, సీఎంవో వెంకటేశం, ఎంఈవో విద్యాసాగర్ పాల్గొన్నారు.

బాధిత మహిళలకు రక్షణగా భరోసా సెంటర్

మెదక్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బాధిత మహిళలకు భరోసా సెంటర్ ద్వారా రక్షణ కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని భరోసా కేంద్రంలో నిర్వహించిన మూడో వార్షికోత్సవంలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. భరోసా సహాయ కేంద్రం సమగ్రమైన సహాయాన్ని అందించడానికి ఏర్పాటు చేశారన్నారు. హింస, లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, మహిళలు మళ్లీ ఇలాంటి వాటి బారిన పడకుండా చూడడమే భరోసా సెంటర్ లక్ష్యమని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బయోమెడికల్ కోర్సు ఉన్న ఏకైక కాలేజీ బీవీఆర్ఐటీ



క్యాప్ జెమిని సంస్థతో శిక్షణ, ఉపాధిపై ఒప్పందం చేసుకుంటున్న బీవీఆర్ఐటీ చైర్మన్ తదితరులు

నర్సాపూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోనే బయోమెడికల్ కోర్సు ప్రైవేటు రంగంలో నడుపుతున్న ఏకైక కాలేజీ నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఒక్కటే అని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ.విష్ణురాజు పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ క్యాప్ జెమినీ సంస్థతో శిక్షణ, ఉపాధికి సంబంధించిన అంశాలపై ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా విష్ణురాజు మాట్లాడుతూ బీవీఆర్ఐటీలో 28 ఏళ్లుగా బయోమెడికల్ ఇంజనీరింగ్ కోర్సును నడుపుతున్నట్లు చెప్పారు. కంప్యూటర్ సైన్స్ కోర్సులు మాత్రమే కాకుండా సంప్రదాయ కోర్సులైన ఫార్మాస్యూటికల్, బయోమెడికల్ కోర్సులను లాభాపేక్ష లేకుండా నడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్యాప్‌జెమిని వైస్ ప్రెసిడెంట్ అతుల్‌కురాని, ప్రోగ్రాం మేనేజర్ సౌరవ్‌నారాయణ్, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్, మేనేజర్ బాపిరాజు, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా రోడ్ల దుస్థితి మారలే..



కానుకుంట-గుమ్మడిదల ప్రధాన రోడ్డు ప్రారంభించాలని పాదయాత్ర చేపట్టిన బీజేపీ నాయకులు

గుమ్మడిదల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పభుత్వాలు మారినా... కానుకుంట-గుమ్మడిదల ప్రధాన రోడ్డు పరిస్థితి మాత్రం మారలేదని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. కానుకుంట-గుమ్మడిదల ప్రధాన రోడ్డు ప్రారంభించాలని కోరుతూ ఆమె నేతృత్వంలో పాదయాత్ర, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రహదారి గుంతలమయంగా ఉండి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. రోడ్డు కోసం ఎన్నోసార్లు ప్రజలు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కావలి ఐలేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పలుగు గోవర్ధన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సామల అంజిరెడ్డి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సృజనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు హాస్టల్ భవనం నిర్మించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్

హత్నూర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూర ఐటీఐ విద్యార్థులకు హాస్టల్ భవనం నిర్మించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. గురువారం హత్నూర ఐటీఐ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లడుతూ హత్నూర ఐటీఐలో శిక్షణ పొంది ఎంతోమంది విద్యార్థులు ఆయా రంగాల్లో స్థిరపడ్డారని ఆయన తెలిపారు. గతంలో ఉన్న వసతి గృహాన్ని అధికారులు ఎత్తివేసారని, దీంతో విద్యార్థులు ఇతర ప్రాంతాల నుంచి సకాలంలో హాజరుకాక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని వసతిగృహ భవనాన్ని నిర్మాణం చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

మెదక్ అర్బన్/పాపన్నపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకమని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మల్లికా పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి పురస్కరించుకొని మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం పట్టణ పోలీసులకు రాఖీలు కట్టారు. పాపన్నపేటలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. సైనికులకు ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ పోలీసులకు రాఖీలు కట్టారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మల్లిక, మండల అధ్యక్షురాలు సున్నం పద్మ పాల్గొన్నారు. అలాగే మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, గడపగడపకు పాదయాత్ర నిర్వహించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు సంతోష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలే శ్రేయస్కరం

- జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి



సంగారెడ్డి మండలం కల్పగూర్‌లో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్/వెల్దుర్తి/కోహీర్/మెదక్, కల్హరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బిడ్డకు ముర్రుపాలే శ్రేయస్కరమని జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి సూచించారు. తల్లిపాల వారోత్సవాలను సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల శిశువుల్లో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం శిశువులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ, జిల్లా పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ సౌమ్య, సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని బసవేశ్వర మహిళ, తదితర ప్రాంతాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త హేమలత హాజరై మాట్లాడారు. వెల్దుర్తి మండల పరిధిలోని శేరి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యురాలు శిరీష, సౌజన్య, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. కోహీర్ మండల పరిధి కవేలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

రైతులు ధర్నా చేసే దుస్థితి దాపురించింది

(5వ పేజీ తరువాయి)

వదలాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి(కేపీఆర్) ధ్వజమెత్తారు. మూడు రోజుల్లో నీరు వదలకుంటే ప్రాజక్టుల గేట్లను బద్దలు కొడతామని హెచ్చరించారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజక్టులపై ప్రభుత్వానికి సోయే లేదన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ రైతులకు బోనస్ ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సభకు అధ్యక్షత వహించిన పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందడానికి కాళేశ్వరం బూచి చూపుతున్నారని ఆరోపించారు. అంతకు ముందు సభలో మాజీ మంత్రి హరీశ్‌రావును పలువురు రైతులు కలిసి తమతో అగ్రిమెంట్ చేసుకున్న కంపెనీలు కొనుగోలు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. రైతు మహాధర్నాలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు శశిధర్‌రెడ్డి, క్రాంతికిరణ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, మాజీ మున్సిపల్ చైర్మన్లు బట్టి జగపతి, ఆరెళ్ల మల్లికార్జున్‌గౌడ్, నాయకులు, రైతులు హాజరయ్యారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి



విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ నగేష్

చేగుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ విద్యార్థులకు సూచించారు. గురువారం సాయంత్రం చేగుంట ఎస్సీ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లో నీరు, భోజనం, విద్యాబోధన, తదితర సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రద్ధతో చదువుకుని మంచిస్థాయిలో నిలవాలన్నారు. ఆయనవెంట వార్డెన్ రమేష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : హనుమంతరావు



కొర్విపల్లిలో కార్యకర్తలను పరామర్శిస్తున్న హనుమంతరావు

చిన్నశంకరంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు చిన్న రమేష్‌గౌడ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అలాగే కొర్విపల్లిలో ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రామచంద్రం అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. జంగరాయిలో మాజీ సర్పంచ్ నెల్బూర్ తల్లి మరణించడంతో అతడి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. మనోధైర్యం కోల్పోవద్దని వారికి సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, మాజీ సొసైటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీమాన్‌రెడ్డి, యాదారావు ఉన్నారు.

వేశారు.. తొలగిస్తున్నారు..!



డివైడర్‌లోని మొరం మట్టిని తొలగిస్తున్న కూలీలు

రామచంద్రాపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరులోని అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)కు అనుసంధానంగా నిర్మిస్తున్న రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ డివైడర్ పనులు ఫిబ్రవరి చివరలో ప్రారంభించారు. ఓవైపు డివైడర్ నిర్మిస్తుండగానే మధ్యలో మొరం మట్టిని తీసుకువచ్చి డివైడర్‌లో వేశారు. పనులు చేస్తుండగానే డివైడర్ కూలడం, ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించని పనులపై 'ఆంధ్రజ్యోతి' మార్చి 3న 'కడుతుండగానే కూలుతోంది..' కథనాన్ని ప్రచురించింది. డివైడర్‌లో రాళ్లు రప్పలు వేయడం వల్ల అక్కడ మొక్కలు పెరగవు అనే నిర్ణయానికి వచ్చిన ఆర్ అండ్‌బీ అధికారులు.. గురువారం కూలీలను పెట్టి మొరం మట్టిని బయటకు తీయించారు. ప్రణాళిక లేని పనుల కారణంగా ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంగారెడ్డిలో జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీ

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో గురువారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన అనంతరం సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు మారుతున్న కాలానుగుణంగా తమ వృత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. తద్వారా చేనేత కళ అంతరించిపోకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకుడు చేనేత, జౌళిశాఖ అధికారి వెంకట్‌రావు, హెచ్‌డబ్ల్యూసీఎస్ అధ్యక్షుడు అశోక్, కృష్ణయ్య, డైరెక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలకాలి'

జహీరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగు సమయాల్లో రసాయన ఎరువుల వాడకానికి స్వస్తి పలికి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త రమేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సత్వార్ గ్రామంలో డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో వ్యవసాయ పద్ధతులపై ఆచారణాత్మక ప్రదర్శన నిర్వహించారు. రైతులు ఏయే సమయాల్లో ఎలాంటి ఎరువులు, పిచికారీమందులను ఏయే మోతాదుల్లో వాడే విధానంపై అవగాహన కల్పించారు.

'మహాధర్నాను విజయవంతం చేయాలి'

చిన్నశంకరంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. చిన్నశంకరంపేట మండలంలోని ధర్పల్లి, గవ్వపల్లి, సూరారం, చందంపేట, కొర్విపల్లి పాఠశాలల్లో పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. అనంతరం మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లారెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబు పాల్గొన్నారు.

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

కల్హేర్/సిర్గాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా కంది, పత్తి పంటల్లో అంతర పంటగా గంజాయిని సాగుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిర్గాపూర్ ఎస్ఐ మహేష్ హెచ్చరించారు. గురువారం సిర్గాపూర్ మండల పరిధిలోని వంగ్దల్ గ్రామ శివారు భూముల్లో పత్తి, కంది పంటలను పోలీసులు జల్లెడ పట్టారు. మూరుమూల ప్రాంతం కావడంతో ఇదివరకు ఈ ప్రాంతంలో గంజాయి సాగు చేసేవారని తెలిపారు. మళ్లీ అలాంటివి చేస్తే చర్యలు తప్పవన్నారు.